# ఒక విశ్వం — ఒక రేణుక

కొండల్లో సూర్యుడు అస్తమించి గంటకు పైబడినప్పటికీ ఇంకా మసక వెలుతురు ఉండనే ఉంది. ఆకాశంలో నక్షత్రాలు అక్కడా అక్కడా మెరుస్తున్నాయి. ఆ మసక వెలుగుల్లో విశ్వం నడుస్తున్నాడు. అతడి మనసునిండా రేణుక... కొద్ది నిమిషాలలో రేణుకను చూడబోతున్నాడు.

ఊరు సమీపిస్తున్నది. దీపాలవెలుగు. మేఘం పల్చగా ఊరు పూరిళ్ల పైకప్పుల మీదికి దిగినట్టు సాయంత్రం వంటలపొగలు. ఇంకో ఫర్లాంగ్ దూరం... అతని గమ్యం... ఇప్పుడు.

ప్రక్కనే మామిడితోట. మనసులోని అశాంతికి నేపథ్యసంగీతంలా చెవుల్లు గింగుర్లెత్తే కీచురాళ్లరొద. చెట్లనీడల చీకట్లలో మిణుగుర్లు ఈదులాడుతున్నాయి. చుట్టూ కనుచూపు మేర పొలాలు. సమీపాన చెరువుగట్టు మీద ఈతచెట్లు... సాయం పవనాలకి మత్తుగా ఊగుతున్నాయి.

'బావా!'

ప్రకృతిమందమైన ఆ సందడిలోంచి పిలుపు. రేణుక రూపం కోసం అతడు వెతికాడు. నడుస్తూనే ఉన్నాడు. చుట్టూ వెతికి చూశాడు. ఎవరూ కన్పించలేదు. తనకు వినిపించిన ఆ పిలుపు తన భ్రమ అన్పించింది. అది తన మేనమామగారి

తోట. రేణుక తోటలో ఉందా?

వెనక్కి తిరిగి చూశాడు విశ్వం.

నిర్మానుష్యంగా తోట, పొలాలు, తాటిచెట్లు, ఈతచెట్లూ, చెరువుగట్టు కన్పించాయే తప్ప మానవరూపం ఏదీ కన్పించలేదు.

ముందుకు నడుస్తున్నాడు విశ్వం.

'బావా'

'రేణూ'

'అవును నేనే బావా!' అని నవ్వింది గలగలా. 'జడుసుకున్నావా బావా?' అంది నవ్వుకుంటూనే. తోటలోని చెట్లనీడల్లో రేణుక.

పువ్వులు పూస్తున్న యవ్వనం గాలికి ఊగుతున్నట్టు తనవేపు వస్తున్నది తోటలోంచి రేణుక. కలలు ఈడేరినట్టు విశ్వం ముఖంలో సంతోషాతిశయ రేఖలు ఉదయించాయి.

మనసు ఉక్కిరి బిక్కిరై మాట రాలేదు.

'మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయా బావా?'

మూగిగా చూస్తున్నాడు రేణుకను.

విశ్వం మెలికలు తిరిగే కాలిబాటలో ఆగి చూస్తున్నాడు రేణుకని. ఆమె అతడిని సమీపించింది. అతడి కుడి ప్రక్కకి ఆమె వచ్చి ఆగింది.

'పోన్లే, పెళ్లి కెందుకు రాలేదో చెప్పు బావా?'

విశ్వం నోట మాట రాలేదు. ఆమె కోసమే ఇప్పుడు విశ్వం తన మేనమామ గారి ఊరు రావటం. తీరా ఆమె ఎదురయ్యే సరికి దుఃఖం ముంచుకొచ్చింది. ఆ దుఃఖం ఆమెకి తెలీనీయవద్దని నిగ్రహించుకుంటున్నాడు. కాని రేణుక పాత అనుబంధాలతో ఉసిగొల్పుతున్నది.

'మూగివాడయ్యాడు మా బావ' అని గలగలా నవ్వింది రేణుక.

'లేదు రేణూ...' దుఃఖాన్ని మనసులో దాచుకోలేక పోయాడు.

'మరి?'

'పిచ్చివాణ్ని అయ్యాను' నెమ్మదిగానే చెప్పినా ఉద్రేకం గర్జించినట్టున్నాయి ఆ మాటలు.

రేణుక భయపడిపోయింది. ఆ మాటల్లోని అర్థం ఆమెకి తెలిసింది. దుఃఖపు కెరటం ఆమె లోలోపల ఉప్పొంగింది.

'ఒకరి మోసానికి నా జీవితం బలయిపోయింది. అంతా నా తెలివి తక్కువ.

నమ్మి మోసపోయాను.' అని ఆత్మనింద చేసుకున్నాడు. పెళ్లి జరిగిన రెండు మాసాల తర్వాత తను కోల్పోయిన మేనగోడల్ని చూట్టానికి వస్తున్నాడు.

'ఎవరు మోసగించింది... నీవు... నా జీవితం... నా జీవితం...' అని మాట్లాడలేకపోయింది. ఆమె పెదవులు వణుకుతున్నాయి. కండ్లు మూసుకుంది రేణుక.

ఆమె మాటలు అతడు విన్పించుకోలేదు.

'నన్నొక ఆట బొమ్మని చేసి ఆడించావు. ఆడించాలనుకున్నావు. నీ కోరిక తీరింది కదా... ఇప్పుడు సంతోషంగా ఉంది కదా?'

రేణుక కళ్లల్లోంచి కన్నీళ్లు కురుస్తున్నాయి. కంఠం రుద్ధమయింది. ఇంత కఠినంగా బావ మాటాడుతాడని ఆమె ఊహించలేదు. పైగా నింద తన మీద మోపుతున్నాడు.

'బావా, నీ గుండె ఒకరాయి. నీవు మనిషివి కావు. రాక్షసుడవు.'

ఆమె ఆ మాటలు అంటూనే ఏడుస్తున్నది.

'ఏమన్నావ్? నేనా?' అని ఆమె భుజం మీద చెయ్యేసి నెట్టాడు... సహించలేక 'ఏమన్నావ్... మళ్లీ అను'

'అంటాను. నీ గుండె ఒక రాయి. నీవు మనిషివి కావు. రా... క్ష... సు... డ... వు.'

'నేనా... నీలాగ... అందరితో ఆటలాడే...'

అతడి చెంప చెళ్లుమంది. మూడు... నాలుగు...

అతడు తల తిప్పుకోలేదు. ఎదిరించలేదు. కన్నీళ్లు జలజలా రాలాయి.

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

'మున్నూట అరవై రోజుల తర్వాత చూడాలని వచ్చినందుకు చక్కని మర్యాద చేశావ్... చాలు...'

అతడి మాటలు ఆమెని నిలువునా దహించేస్తున్నాయి.

పెద్దలు చేసిన పెళ్లి. తన తప్పు ఏమున్నదని. 'బావనే పెళ్లి చేసుకుంటానని తను పట్టుపట్టలేదు. నిజమే. కాని తల్లికీ, తండ్రికీ, అమ్మమ్మకీ, నాన్నమ్మకీ, తాతయ్యలకీ తెలీదా? తెలిసి మరి ఈ పెళ్లి ఎందుకు చేశారు. జాతకాలు కలవలేదంటారు. ఈ కొత్త సంబంధం వాళ్లు వచ్చి, కోరి చేసుకుంటామని అడగటం, వాళ్ల మంచీ, వాళ్ల పేరూ ప్రతిష్ఠా, ఆ అబ్బాయి అందమూ, చదువూ, ఉద్యోగమూ —— ఇవన్నీ తనకేమీ తెలీవు.

పెద్దల ఇష్టం మీద జరిగింది.

'తిరస్కరించి అవమానపరచావు. మోసం చేశావు. ఇప్పుడు నా జీవితం నాకే రోతగా తయారయింది. అయినా బతుకుతున్నాను...' అన్నాడు విశ్వం. రేణుక ఏడుపులో, ఉద్రేకంలో విశ్వం మాటలు ఆమె చెవిని పడలేదు. తన ఏడుపు తప్పించి ఆమెకు ఇంకేమీ విన్పించటంలేదు. దుఃఖం కట్టలు తెగి ప్రవహిస్తున్నట్టుంది.

ఇప్పుడు విశ్వంకి తన బాధే దుఃఖమై అతడి కండ్లలోంచి కన్నీటి బిందువులు జారిపడ్డాయి. మౌనంగా ఉండిపోయాడు.

'పుట్టకతోనే తల్లిని పోగొట్టుకున్న వాడిని. ఎందుకు బతుకుతున్నానో నాకే తెలీదు. నాకు ఈ ప్రపంచంలో ఏ ఆశాలేదు. బతుకులో ఒకే ఆశగా నిన్ను చూసుకున్నాను. ఇప్పుడు ఆ అద్రుష్టాన్ని కూడా కోల్పోయాను. దురద్రుష్ట వంతుడికి జీవితం అంతా పరాజయాలే, కన్నీళ్లే! చాలాసార్లు చచ్చిపోవాలనే అనుకుంటాను. కాని తెగించలేకపోతున్నాను...'

ఈ మాటలు రేణుక విన్నది.

అవును బావ అంటే ఇష్టం. బావ మంచివాడు. తల్లిలేనివాడు. తండ్రీ, సవతి తల్లీ బావని సరిగ్గా చూడరు. బావ అంటే వాళ్లకు ప్రేమలేదు.

అయినా బావ కాలేజీలో చదువుకుంటున్నాడూ అంటే అది తాతయ్య, చిన్నమ్మల ప్రేమే. చిన్నమ్మనే తల్లి చనిపోయిన తర్వాత బావను పెంచింది. తన దగ్గరే ఉంచుకుంది. తన పిల్లలతో అక్క కొడుకును తన కొడుకే అన్నట్టు పెంచింది.

రేణుక ఏడుపు నెమ్మదించింది. ఆమె కళ్లల్లోంచి జారుతున్న కన్నీళ్లు ఆగిపోయాయి. ఆమెకి ఏం మాటాడాలో తోచలేదు. మౌనంగా ఉండిపోయింది.

విశ్వం ఆమె భుజంమీద చెయ్యివేసి ఓదార్చబోయాడు. ఆ చేయి తనను తాకకూడదని దూరంగా తొలగిపోయింది రేణుక.

అంతలో ఆ కాలిదారినే ఊరువేపు నలభయ్యేళ్ల మనిషి ఒకడు వాళ్లను చూసుకుంటూ వెళ్లాడు.

విశ్వం వెనక్కి తిరిగాడు. 'ఎవరికోసం వెళ్లబోయానో వాళ్లే గుణపాఠం నేర్పారు.' అని వెనక్కి తిరిగి వచ్చిన దారి పట్టాడు. పది గజాల దూరం వెళ్లిపోయాడు. వడివడిగా నడచిపోతున్నాడు. గాలిలా దూసుకుపోతున్నాడు.

'బావా!' పిలిచింది రేణుక.

విశ్వం ఆగలేదు. వేగం మరింత హెచ్చింది.

'బావా... ఆగు ఆగు. ఆగుబావా'

పరుగెత్తింది. జారుతున్న వోణీని సర్దుకుంటూ. ఆమె జుత్తు ముడి ఊడి వేలాడింది. పరికిణి కుచ్చిళ్లు అడ్డం పడినట్టయి తూలిపడుతూ అదే పరుగుతో వోయి అతడిని సమీపించింది. కాలుకి తీగెమొక్క అడ్డంపడి నేలమీద ఆమె పడిపోయింది. ఆమె చెయ్యి విశ్వం పాదాన్ని తాకింది.

ఆమె గొంతులోని ఆవేదనని వినికూడా విశ్వం ఆగలేదు. అతడిలో విచక్షణాభావం నశించింది. అవును గుండె రాయి అయ్యింది. రాక్షసుడయ్యాడు. వెనక్కి తిరగలేదు. తన పాదానికి ఆమె చెయ్యి తాకినప్పుడు, ఆమె పడి పోయిందని తెలిసికూడా విశ్వం వెనక్కి తిరిగి చూడలేదు. పోతున్నాడు. వచ్చిన దారినే తిరిగి వెళ్లిపోవాలని.

'బావా.' అని మరొకసారి ఏడుపు గొంతు పెట్టింది.

'నీ మేనత్త మేనమామల గౌరవం కోసమన్నా వెనక్కి తిరుగు. ఇంటికి రా. ఇప్పుడు వెళ్లాడే —— వాడు మనకు పడని వాడు. ఊళ్లో మన గురించి ఒకటికి నాలుగు చేర్చి చెప్తాడు. పరువు పోతుంది. ఏం చేసిందో —— ఇంటికి రాకుండా మేనల్లుడు తిరిగి వెళ్లిపోయాడని —— నన్ను తిట్టారు. ఆగుబావా.'

విశ్వం ఆగలేదు. రేణుక మళ్లీ పరుగెత్తింది. అడ్డం నుంచుని అతడి చేతిని తన రెండు చేతులతో గట్టిగా పట్టుకుంది.

'తల బద్దలు కొట్టుకుని చావనా? అప్పుడన్నా నీ కోపం చల్లారుతుందా? బావా?'

అతడు చెయ్యి విదిలించుకున్నాడు. కదిలాడు.

'నీ పాదాలకు మొక్కుతాను'

ఆ మాటతో విశ్వం ఆగిపోయాడు. వెనక్కి తిరిగాడు. ఆమెను చూశాడు.

విరబోసుకున్న జుత్తుతో, కన్నీళ్ల ముఖంతో దీనంగా కన్పించింది రేణుక. ఆమె భయపడిపోయి, వణికిపోతున్న గొంతుతో ప్రాధేయపూర్వకంగా 'రా బావా, నాదే తప్పు. సరేనా. ఇంటికి రా.' అని చేయిపట్టుకుని తనతోపాటు వెనక్కి తిప్పింది. ఆ రెండు ఆకారాలు ఒకరి వెనక ఒకరు ఒకే నీడలా ఊరివేపుగా నడవసాగారు.

ఆ రాత్రి విశ్వంకి నిద్రపట్టలేదు. ఆరుమైళ్ల దూరం కాలిబాటలో పొలాల గట్లమీంచి నడచి వచ్చాడేమో కాళ్లు నొప్పులు పెట్టాయి. పాదాలు వేడిగా మండు తున్నాయి. మోకాళ్ల కీళ్లల్లో నొప్పి. విపరీతంగా దాహం. కండ్లమంట. పాలం వేడిగా ఉంది. నిద్ర రాదు. తర్వాత వొళ్లంతానొప్పులు మొదలయ్యాయి. పండుకోలేదు. కూర్చో లేదు. తల బరువుగా ఉంది. కండ్లు మండుతున్నాయి. వేకువజాముకల్లా పెద్ద జ్వరం.

మూడోరోజు ఉగాది. ఆ పండగ వచ్చిందీ లేనిదికూడా విశ్వంకి గుర్తులేదు. వారందినాల తర్వాత కండ్లు తెరచేసరికి ఊళ్లోని వైద్యుడు, మేనత్తా, మేనమామలు, పరిచర్యలు చేస్తూ రేణుక, మందుసీసాలు, పళ్లు, నీళ్ల చెంబూ గ్లాసు —— స్పిరిట్, మందుల వాసనలు ---- అక్కడ వింతవాతావరణం కన్పించింది. బలహీనంగా ఉంది. కూర్చోవటానికి కూడా శక్తి చాలటం లేదు. మాటాడేందుకు సైతం గొంతు పెకలటం లేదు.

అక్కడున్న వాళ్లల్లో రేణుక మాత్రమే అతడికి కన్పిస్తున్నది.

ఇంక ప్రమాదం తప్పిపోయినట్టే అంటున్నాడు వైద్యుడు.

ఆ రెండోరోజే తిరిగి వెళ్లిపోవాలని వచ్చినవాడు ఇక్కడ మంచం పట్టాడు. ఆ ఏడాది డిగ్రీ పరీక్షలు రాయలేకపోయాడు. ఇప్పుడు వెళ్లినా రాయవచ్చు. కాని ఇంకో నెలదినాలన్నా పట్టుంది కోలుకోవటానికి అనుకుంటున్నారు. వాళ్లమాటల్లో తెలిసిందల్లా ప్రాణాపాయం తప్పిందన్నదే.

రేణుక వేళకు మందులు తెచ్చి ఇస్తుంది. మాత్రలు మింగగలుగుతున్నాడు గాని ఆ టానిక్‌లు చేదు తాగలేకపోతున్నాడు. పైగా ఆ మందులవాసన పడటం లేదు. చాల ఇబ్బంది పడుతున్నాడు. రేణుక బతిమాలుతుంది. కోప్పడుతుంది. చిన్నపిల్ల వాడిలాగా ఏమిటీ అని విసుక్కుంటుంది. పండ్లు తినటానిక్కూడ బతిమాలవలసిందే. పాలు తాగించటానిక్కూడా ప్రాధేయపడాల్సిందే. అయినా విరామం లేకుండా అర్ధరాత్రి పూట కూడా మందులు తినిపిస్తున్నది. తాగిస్తున్నది.

'వారం దినాలు ఈ బాధ భరించావంటే పూర్తిగా కోలుకుంటావ్ బావా. ఈ అనారోగ్యమే నిన్నిలా బాధిస్తున్నది. ఇప్పుడు ఈ మందులు మానేసినావ్ అనుకో, జబ్బు మళ్లీ తిరగబెట్టుంది అంటున్నాడు డాక్టరు.' పరీక్షల బెంగ. సెప్టెంబర్‌కు రాసుకోవచ్చునని నచ్చచెప్పుకున్నాడు.

తల్లిప్రేమ తెలియని విశ్వంకి రేణుక ముఖంలో ఆ ప్రేమ కన్పించేది. ఎట్లా వచ్చిందో ఈ సేవా భావం ఆమెకి. నాన్న మధ్యలో వచ్చి ఒక పూట ఉండి కోర్టుపని తొందరవల్ల తిరిగి వెళ్లిపోయాడట. తమ్ముడూ, చెల్లెలూ చూట్టానిక్కూడా రాలేక పోయారు. వాళ్లకి పరీక్షలు. చదువు.

అతడు చదివిన నవలల్లోని దేవతామూర్తిలా కన్పించసాగింది రేణుక. ఆమె మాటల్లో ప్రేమ. ఆమె చూపుల్లో ప్రేమ. తను విసుక్కునేటప్పుడు ఆమె వేడుకోలు. ఆమె ఉపచారసేవలు. ఆమె చివరికి జబ్బుమనిషి అయ్యేట్టుంది. నిద్రాహారాలు

పట్టించుకోలేదామె.

నెలదినాల తర్వాత ఆరోగ్యం కోలుకున్నాడు విశ్వం. శరీరం తేలికపడింది. ఓ వేకువజామున లేచి విశాఖపట్నం వెళ్లిపోయాడు.

అయితే వెళ్లిపోయేముందు బావ తనతో చెప్పనన్నా చెప్పలేదు. ముప్పయిదినాలసేవ తనకు సంతోషంగా ఉంది. వెళ్లిపోతున్నప్పుడు సాగనంప లేకపోయినందుకే బాధ. మళ్లీ దగ్గర్లోనే వస్తాడో ఏమో.

3

నాన్న పెళ్లి విషయం మాట్లాడేందుకు రమ్మని ఉత్తరం రాస్తే ఊరు వెళ్లాడు విశ్వం. 'పెళ్లి చేసుకోను. నా పెళ్లి గురించి... పెళ్లి చూపులు అని ఒత్తిడి చేయవద్దు.' అని తండ్రితో స్పష్టంగా చెప్పేశాడు. తిరిగి వస్తున్నప్పుడు దార్లో ఉన్న మేనమామగారి ఊరు వెళ్లాలనుకున్నాడు. రేణుకను చూడాలనిపించింది. మండుటెండలు. కాలినడక తప్ప ఆ ఊరుకు ఇంకో దారి లేదు. తీరా వెళ్లేసరికి తెలిసిన సంగతి అత్తయ్య జ్వరంతో కదల్లేని పరిస్థితిలో ఉందని. కాళ్లు కడుక్కోవటానికి నీళ్లిచ్చేవాళ్లుకూడా ఇంట్లో ఎవరూ లేరు. రేణుక అత్తవారింట్లో ఉందని తెలిసింది. అత్తయ్య చెప్పిందేమిటంటే మామయ్య రేణుకను తీసుకురావటానికి వెళ్లాడట నిన్న.

రేణుక వస్తుందని తెలిసి ఆరోజు అక్కడ ఆగిపోయాడు విశ్వం.

రాత్రి చీకటి పడిన తర్వాత గణగణ గంటల మోతతో ఎద్దులబండి ఒకటి ఆ ఇంటి ముందు ఆగింది. ఆ బండిలోంచి రేణుక, మామయ్య దిగారు. ఆ సమయానికి వైద్యుడు ఇంట్లో ఉన్నాడు. విశ్వం అత్తయ్య మందులు గురించి వైద్యుడితో మాట్లాడుతున్నాడు. జ్వరం రేపటి కల్లా తగ్గిపోతుందని ధైర్యం చెప్తున్నాడు వైద్యుడు. ఆ రాత్రి రేణుక వచ్చిన తర్వాత వంటపనిలో, తల్లిసేవలో ఉండటంవల్ల రేణుకతో మాట్లాడే అవకాశం చిక్కలేదు. పైగా అన్నంతిన్న వెంటనే నిద్రముంచుకొచ్చి మెలుకువతో ఉండలేకపోయాడు. మరుసటిరోజు నిద్రలేచేసరికి సూర్యోదయమై చాలాసేపు అయినట్టుంది. వాకిట ఎండ పడుతున్నది. అప్పటికే మామయ్య స్నానంచేసి పూజచేసుకుంటున్నాడు.

వైద్యుడు చెప్పినట్లే అత్తయ్య జ్వరం తగ్గింది. ఇంటి పనులన్నీ ఆమె చేసుకో సాగింది. ఇల్లంతా వెతికి చూశాడు రేణుక కోసం విశ్వం. ఎక్కడా ఆమె కన్పించలేదు. అత్తయ్యని అడిగితే స్నేహితురాళ్లు వచ్చి తీసుకుపోయారని, అంతా చెర్లో స్నానానికి వెళ్లి ఉంటారని చెప్పింది. విశ్వంకి చెర్లో స్నానం అలవాటే. అయితే ఇంత ఉదయమే కాదు. పదిగంటల సమయంలో వెళ్తే రేవులో ఆడవాళ్ల రద్దీతగ్గుతుంది. ఈలోపల

రేణుక వచ్చేస్తుంది.

మామయ్య, పొరుగూర్లో పోట్లాటలో చనిపోయిన ఒక హత్యకేసు వ్యవహారం మూలంగా ఉదయమే వెళ్లిపోయాడు. పోలీసుకేస్ అది. గ్రామమున్సబుగా మామయ్య అక్కడ ఉండాలి. పోలీసులతో, సాక్ష్యాలసేకరణతో, రిపోర్ట్లతో రాత్రికి ఇంటికి రాలేనని కబురుపెట్టాడు.

అమ్మ జ్వరం తగ్గింది. రేణుక తిరిగి అత్తవారింటికి వెళ్లిపోతుందో ఒకటి రెండు రోజులు ఉంటుందో తెలీదు.

పది గంటలకు భోజనం. ఆ సమయంలో కూడా రేణుక కన్పించలేదు. కోవిలికి వెళ్లిందట. ఆ ఊళ్లో దేవాలయం లేదు. పొరుగూరు వెళ్లాలి. అక్కడ పాతకాలపు శివాలయం ఉంది. కాలి నడకనే వెళ్లిరావాలి. తిరిగివచ్చేసరికి ఒంటిగంట దాటుతుంది. పైగా స్నేహితురాళ్లతో వెళ్లిందట. సోమవారం కావటంతో పూజలరద్దీ బాగా ఉంటుంది. ఇంకా ఆలస్యమైనా కావచ్చు.

పొరుగూరు నుండి స్నేహితుడు రాజశేఖరం మధ్యాహ్నం మండుటెండలో తన కోసం వచ్చాడు. నిన్న ఈ ఊరు వచ్చేటప్పుడు, దార్లో వాళ్లపల్లెలో అతడి ఇంటికి వెళ్తే, ఏదో పనిమీద కళింగపట్నం వెళ్లాడని సాయంత్రంకి రావచ్చని చెప్పారు. విశ్వం మర్నాడే తిరుగు ప్రయాణం పెట్టుకున్నందువల్ల రాజశేఖరంని రమ్మని చెప్పలేదు ఆ ఇంట్లో. అయినా ఆ స్నేహితుడు వచ్చాడు. వాళ్ల పల్లె దగ్గరే. ఇరవై నిమిషాల నడకదారి. పైగా వాళ్ల ఊరు సముద్రం ఒడ్డున సరుగుడు తోటల మధ్య ఉంటుంది. చాల అందమైన ఊరు. ఆయనతో వెళ్లి విశ్వం రాత్రి తిరిగి ఇల్లు చేరుకునేసరికి రేణుక నిద్రలో మునిగిపోయింది. త్వరగా తిరిగి వచ్చేయాలనే వెళ్లినా స్నేహితుడు, వాళ్లమ్మ, అన్నం తిని మరీ వెళ్లమని విడిచిపెట్టలేదు. రాజశేఖరం తల్లిని చూసినప్పుడల్లా అమ్మ బతికి ఉంటే ఇట్లాగే ఉండేదేమో అన్పిస్తుంది విశ్వంకి. అంతే కాదు... తనని కూడా ఆమె తన కుమారుడిలాగానే చూస్తుంది. రాజశేఖరం చెల్లెలు తనను అన్నయ్యా అని ముద్దుగా పిలుస్తుంది.

'బావ వస్తే నిద్ర లేపు' అని రేణుక చెప్పిందని అత్తయ్య రేణుకను నిద్ర లేపాలని ప్రయత్నించింది. ఎంత ప్రయత్నించినా రేణుక మేలుకోలేదు. మొద్దునిద్ర. తెలిసిందే. విశ్వం కూడా ప్రయత్నించాడు. ముఖం పట్టుకుని ఇటూ అటూ తిప్పాడు. చన్నీళ్లు ముఖం మీద చల్లాడు. అయినా రేణుక లేవలేదు.

ఆ రాత్రి విశ్వంకి నిద్ర పట్టలేదు. సామాన్యంగా విశ్వం బైట అరుగుమీద పడుకుంటాడు. ఆడవాళ్లు లోపల ఇంట్లో పడుకుంటారు. పెరటి ప్రహరీగోడ తలుపు

తప్పించి అన్ని తలుపులు, కిటికీలు తెరచే ఉంటాయి.

రేణుకతో మాట్లాడాలని ఉంది. సెలవులేదు. రేపు వెళ్లిపోవాలి. కొత్తగా ఉద్యోగంలో చేరాడు. ఇంటినుండి వేకువజామున బయల్దేరితే తప్ప పది గంటల్లోపు విశాఖపట్నం చేరుకోలేడు. ఆరు మైళ్ల కాలినడక తప్పదు.

రేణుక అత్తవారింట కాపురం చేస్తున్నది. ఆ ముచ్చట్లు వినాలని ఉంది.

ముఖ్యంగా తండ్రి తన పెళ్లి కోసం చేస్తున్న ఒత్తిడి గురించీ, తను జీవితంలో పెళ్లి చేసుకోకూడదని చేసిన ప్రతిజ్ఞ గురించీ చెప్పాలనుకున్నాడు. ఆ అవకాశం చిక్కేట్టు లేదు. ప్రయాణం వాయిదా వేసుకునేట్టులేదు.

రేణుకతో చెప్పాలనుకున్న విషయాలు చాలా ఉన్నాయి.

తన కొత్త ఉద్యోగం. విశాఖ పట్నంలో కాల్‌టెక్స్‌లో వచ్చింది. చాల మంచి ఉద్యోగం. మిత్రులంతా అభినందించారు. తనకు గర్వంగా ఉంది. చిన్నమ్మ చాలా సంతోషించింది. నీ కష్టాలు గట్టెక్కినాయిరా నాయినా అని మురిసిపోయింది.

అత్తవారింట్లో రేణుక సంతోషంగా ఉందా? భర్తా, అత్త మామలూ, ఆడపడుచులూ, ఇతర పెద్దలూ ప్రేమతో చూసుకుంటున్నారా? ఆ వివరాలు తెలుసుకోవాలని కుతూహలపడ్డాడు.

పెళ్లితో రేణుక తనకు శాశ్వతంగా దూరమైపోయిన భావం విశ్వంకి కలగటం లేదు. చిన్ననాటి నుండి పెరిగిన బాంధవ్యం. అది తెగిపోదు అని ఇంకా ఆశ. రేణుక సంతోషంగా ఉండాలి. అదీ అతడు కోరుకుంటున్న కోరిక. ఇప్పుడు.

## 4

'జీవితంలో ఏం సాధిద్దామని ఇంకా ఈ ఉబలాటం' అని మనసు ఎదురు తిరిగి నిలదీసి అడిగినప్పుడల్లా 'రేణుక కోసం' అని విశ్వం సమాధానం. రేణుక జీవితంలో అన్ని దశలనూ చూడాలన్న ఆకాంక్ష.

అందుకే రెండేళ్ల తర్వాత రేణుక కోసమే మరోసారి వచ్చాడు. రేణుక తల్లి అయి ఉంటుందని ఆశించాడు. బాబా, పాపా? ఇంతకీ కన్న వారింట్లో ఉందా? లేక అత్తవారింట్లో నేనా? అత్తవారింట్లో ఉన్నా సరే మామయ్యతో ఆ ఊరు వెళ్లి అక్కడ రేణుకని చూడాలనుకున్నాడు.

రేణుక ఇక్కడే కన్నవారింట్లోనే ఉంది. విచిత్రం. ఆహా ఏమి నా భాగ్యం! అనుకున్నాడు విశ్వం. కూరగాయలు తెచ్చుకోవటానికి పొలానికి వెళ్లిందట.

వర్షకాలం సాయంత్రం. చల్లగా ఉంది. పంటపొలాలు పచ్చగా కను చూపు మేర.

ఇంట్లో పసిపాప అల్లరి విన్పిస్తుందని ఇల్లంతా వెతికాడు. ఆ అల్లరి లేదు ఇరుగు పొరుగు వాళ్లు పిల్లల్తో ఆడుకోవటానికి ఎత్తుకుపోతారు. అట్లా ఎత్తుకు పోయారా!

రెండు సంవత్సరాల క్రిందటే కోడల్ని అత్తవారు తీసుకుపోయినట్టు తెలిసింది. అప్పటికి రేణుక వయసు పద్దెనిమిదేళ్లు కూడా నిండలేదు. అది పల్లెటూళ్లల్లో పెళ్లిళ్ల పద్ధతి.

మాతృత్వంతో స్త్రీ సౌందర్యం రాణిస్తుంది. కొత్తగా అతడు చదువుతున్న సాహిత్యంలో ఇట్లాంటి జీవిత సత్యాలు తెలుస్తున్నాయి.

పైగా రేణుకను మాతృమూర్తిగా చూడబోవటమే ఒక అపూర్వమైన అనుభవం.

రేణుక అంతలోనే పెరట్లో కన్పించింది. బరువు కాయగూరల బుట్టని పట్టుకుని వచ్చింది. అత్తయ్య పొరుగింటికి వెళ్లినట్టుంది. మామయ్య కన్పించలేదు. ఇల్లు వెలితిగా ఉంది. నిర్జీవంగా కూడా ఉన్నట్టు అనిపించింది. రేణుక రావటంతో ఇల్లు కళకళలాడసాగింది.

రేణుక కాళ్లు కడుక్కుని వచ్చి కళ్లింతవి చేసి చూసి 'బావా' అని ఆశ్చర్యపోయింది. సంబరపడి పోయింది.

'అమ్మ చూడు, యింకా ఇంట్లో దీపం కూడా పెట్టలేదు' అని ఇంట్లో దీపం వెలిగించింది. 'రా బావా లోపలికి రా' అని విశ్వంని పిలిచింది. లాంతరు వెలిగించాలని లాంతర్లలో కిరోసిన్ పోయటం వత్తి సర్దటం, గ్లాసు శుభ్రం చేయటం వంటి పనుల్లో నిమగ్నమయింది. బయిట ఒక హరికేన్ లాంతరు. ఇంట్లో ఒక లాంతరు తప్పని సరిగా అవసరం.

అయితే వెన్నెల రోజులు. బహుశా పౌర్ణమి ఇవాళనేనేమో!

పశువులు ఊళ్లోకి వస్తున్న సందడి. దూడల అరుపులు. ఆ ఊళ్లో ఇంటిముందే పశువులశాలలు. పనివాళ్లు ఆ పనిలో ఉన్నారు. లేగలను పాలకు విడవటం, పాలు తీయటం ప్రతి ఇంట్లో కనిపించే దృశ్యం.

ఆ పనుల్లో రేణుక పనివాడికి పాలముంత ఇవ్వడం, మధ్య మధ్య చాన్నాళ్లకు వచ్చిన బావతో మాట్లాడటం, బావ చెప్తున్న పట్నం ముచ్చట్లు వినటం — తీరిగ్గా ఒక చోట కూర్చోవటానికి ఆమెకు వీలు చిక్కలేదు. అంతా తానే చూసుకుంటున్నది. అమ్మ పొరుగింట్లో ఎక్కడో ముచ్చట్లలో మునిగి పోయినట్టుంది. లేక నాన్న ఏదన్నా పని చెప్తే వెళ్లిందో.

'బావా, ఇక్కడ వంట గదికి రా. నేను వంటపని చూస్తాను. నీకు టీ చేసి పెట్టనా?' అని విశ్వంని వంటగదికి పిల్చుకున్నది. బైట గదిలో బావతో ముచ్చట్లు

పెట్టుకుంటే వంటపనులు సాగవు. ఇప్పుడు రేణుక వంటలో సాయపడుతున్నది. అమ్మకి కంటి చూపు మందగించింది. ముఖ్యంగా రాత్రిపూట. అది కూడా ఒక కారణం.

రేణుకని దగ్గరగా చూస్తున్నాడు విశ్వం. ఆమె ముఖం నిండా చెరు చెమటలు. నుదుట బొట్టు చెమటకు తడిసి ముఖంలో నిగారింపు పెరిగి శోభిస్తున్నది. ఆమె ఆరోగ్యం మరింత వికసించింది. అప్పుడే విచ్చుకుంటున్న పువ్వులా కన్పిస్తున్నది. సహజంగానే కలువరేకుల కండ్లతో తెల్లటి శరీరసౌందర్యంతో ఆకర్షించే అందం. ఇప్పుడు విశ్వం చూపులకు దేవతామూర్తిలా కన్పిస్తున్నది. పైగా రెండేళ్ళుగా కలవరించి ఆమెను చూట్టానికే వచ్చాడేమో కళ్లార్పకుండా చూస్తున్నాడు.

బైట వీధిలోంచి మామయ్య గొంతు విన్పించింది. దూరంగా ఉన్న ఎవరితోనో పెద్దగా అరుస్తున్నట్లు మాట్లాడుతున్నాడు. పెరట్లోంచి అత్తయ్య వంజిరంచేపని పట్టుకుని వచ్చింది.

రేణుక తను తెచ్చిన కూరగాయలని బుట్టలోంచి బైట పోసింది. టమేటాలు, బెండ కాయలు, బీరకాయలు, మిరపకాయలు, ముల్లంగిదుంపలు, గోరుచిక్కుడు కాయలు, వంకాయలు. బావకి బెండకాయ, బీరకాయ కూరలు ఇష్టమని ఆ కూరల కోసం ఏర్పాట్లు చేస్తున్నది. పొయ్యి మీద ఓ ఆయిలం మీద అన్నం పెట్టింది. రెండో ఆయిలం మీద టీ పెట్టింది. అత్తయ్య వంటగది పెరట్లో కూర్చుని చేపని వంటకి సిద్ధం చేస్తున్నది. బైట విడిచిన చెప్పులు చూసి విశ్వం వచ్చినట్టు గుర్తు పట్టిన మామయ్య సంతోషంగా లోపలికి వచ్చి మేనల్లుడిని పలకరించాడు. మేనల్లుడికి పెద్ద ఉద్యోగం వచ్చిందని, ప్రయోజకుడైనాడని అభిమానం చూపాడు.

ఆ వేళప్పుడు టీ తాగటం నాన్నకి ఇష్టమేనని ఆమె బావకోసం చేస్తున్న టీలో మరి కొంచెం నీళ్లు, టీపొడి వేసింది. తాజాపాలతో పల్లెటూళ్లల్లో టీ ఎంత రుచిగా ఉంటుందో అని విశ్వం మెచ్చుకుంటాడు. ఇప్పుడే పితికిన కొత్తపాలు వచ్చాయి.

వంటగది చాల పెద్దది. ఇంటికి పదడుగులు ఎడంగా ఆగ్నేయంగా ఉంటుంది. అంతా భోజనాలు కూడా ఆ గదిలోనే చేస్తారు.

దీపం వెలిగించిన తర్వాత ఒకసారి పూజ గదికి వెళ్లి దీపం వెలిగించి నమస్కారం చేసి రావటం మామయ్య అలవాటు. పెరటికి వెళ్లి కాళ్లు కడుక్కుని వచ్చి పూజ గదిలోకి వెళ్లాడాయన. నమస్కారం చేసి వంటగదికి టీ కోసం వచ్చాడు.

విశ్వం కోసం, చుట్టం వచ్చినాడని చెప్పి తెచ్చినా ఇంట్లో అందరికీ చేప ఇష్టమే. పైగా సముద్రపు చేప వంజిరం మరీ ఇష్టం. ఊళ్లో రెండు మూడు రోజులుపాటు

ఉంటే జాలారిపేట వేపు వెళ్లి విశ్వం చేపలు కొనుక్కుని వస్తాడు. ఒక్కొక్కసారి సముద్రపు రొయ్యలు, పీతలు దొరుకుతాయి.

'అయితే బావా పగవాళ్లమై పోయామా... రావడం మానేశావ్!' అంది రేణుక నిందా పూర్వకమైన స్వరంతో... గడుసుతనంతో.

ఆ ప్రశ్న విన్న అత్తమామలు గుప్త ఆనందాన్ని పెదవుల్లో దాచుకున్నారు. వాళ్లు ఇదే ప్రశ్న అడగాలనుకున్నారో ఏమో.

విశ్వంకి సమాధానం ఏంచెప్పాలో తోచలేదు. ఉన్నది ఉన్నట్టే మాటాడాలనిపించింది. ఉద్యోగంలో సెలవు దొరకని సంగతి యదార్థమే కాని అది కూడా కారణం కాదు.

'వెళ్లాలి వెళ్లాలి అనుకుంటూనే ఉన్నాను. కాని ప్రతిసారి ఏవో అవాంతరాలు వచ్చి ప్రయాణం వాయిదా పడుతూ వచ్చింది'.

స్వగ్రామం వెళ్లిన రోజుల్లో దార్లో దిగాలని అనుకున్నా వ్యవధిచిక్కక రాలేకపోయాడు. పైగా రేణుక ఈ ఊళ్లో ఉండదు కదా. అదే చెప్పాడు విశ్వం.

'నేను లేకపోతే అమ్మా నాన్నా లేరా? నీ మేనత్త మేనమామలు కారా వాళ్లు?' అంది రేణుక.

'ఎందుకో అన్నీ మరచిపోవాలనిపించింది' అన్నాడు విశ్వం ఈసారి.

'అన్నీ అంటే?'

'అనుబంధాలు...బంధుత్వాలు...ఆశలు...స్నేహాలు...కోపాలు... పట్టుదలలు... అన్నీ' అన్నాడు విశ్వం. నిజానికి ఇవన్నీ విశ్వంకి తన కుటుంబంలో ఉన్న సమస్యలకు సంబంధించినవే తప్ప ఇక్కడ మేనత్త మేనమామలకు సంబంధించినవి మాత్రం కావు. ముఖ్యంగా రేణుకకు సంబంధించినవి కావు. రేణుకను మరచి పోవాలనుకోవటం లేదు.

'మరి మరచి పోయావా?' అని విశ్వం కళ్లల్లోకి చూసి మరీ అడిగింది రేణుక.

'అంతే కదా. రెండేళ్లు.'

'మీ ఊరు వెళ్తున్నావు కదా?'

'తప్పని సరి అయి... నాన్న ఆరోగ్యం బాగాలేదని తెలిసి ఒకసారి, ఊళ్లో స్నేహితుడి పెళ్లికోసం ఒకసారి... అంతే. అసలు ఇక్కడకు రావాలని బుద్ధి పుట్టలేదు. నువ్వు ఉండవు కదా అన్పించేది.'

'ఇప్పుడు బుద్ధి పుట్టిందా'

విశ్వం బైట గదికి వెళ్లి తన ఎయిర్‌బేగ్ తెచ్చాడు. ఆ బేగ్‌లోంచి అత్తయ్య కోసం

ఒక చీరె, మామయ్య కోసం తెచ్చిన చొక్కా గుడ్డ, పంచెల జత తీసి వాళ్ల చేతుల్లో పెట్టాడు.

'సింహాచలం ప్రసాదం' అని ఓ పొట్లం లడ్డూలు రేణుక చేతిలో పెట్టాడు.

బావకీ, నాన్నకీ టీ ఇచ్చింది రేణుక. ఇద్దరూ వేడి వేడి టీని ఇష్టంగా తాగుతున్నారు. రేణుక చేత్తో చేసిన టీ అవటం వల్ల మరీ రుచిగా ఉంది విశ్వంకి.

'మరి నాకేం తెచ్చావు బావా?'

రెండు బొమ్మలు బైటికి తీశాడు విశ్వం. కుక్క పిల్ల రబ్బరు బొమ్మలు ఆ రెండు. అవి తీస్తున్నప్పుడు వాటిని చూసి రేణుక ఫక్కున నవ్వింది.

'నేను ఇంకా పసిపాపనే అనుకున్నావా?'

ఆమె వ్యాఖ్యానానికి విస్తుపోయాడు విశ్వం. మౌనంగా ఉండిపోయాడు. నోరు విప్పలేదు. ఈ సరికి రేణుక తల్లి అయి ఉంటుందని ఆ పాపాయి కోసమని ఈ బొమ్మలు కొనుక్కొచ్చాడు. రేణుకకి ఆ ఆలోచన ఎందుకు కలగలేదో ఆశ్చర్యంగా ఉంది అతడికి.

కొంత సేపటి తర్వాత విశ్వం నోరు విప్పాడు.

'నీవు ఇక్కడ ఉంటావని కలగన్నానా?'

'కన్నవారింటికి రాకుండా ఉంటారా?' అంది అతడి ధోరణిని ఖండించాలని.

'తప్పే అవేం మాటలు?' అంది అత్తయ్య.

'మరి బావ మాట్లాడే పద్ధతి చూడు ఎట్లా ఉందో.'

ఆ ఇంట్లో రేణుక అన్నయ్యలు ఇద్దరు చనిపోయారు. పదేళ్ల క్రితం. పెద్దవాడు స్నేహితులతో సముద్రం స్నానానికి వెళ్లి మునిగిపోయాడు. అప్పుడు ఆరోతరగతి చదువుతున్నాడు వాడు. చిన్నవాడు జబ్బు చేసి సరైన వైద్యం అందక చనిపోయాడు. ఆ దుఃఖంతో అత్త మామలు కుమిలిపోయారు. ఇప్పటికీ వాళ్ల ముఖాలలో ఆ దీనత్వం తొలగిపోలేదు. వాళ్ల జీవితాలలో మూగవేదన వాళ్లకు లోపల్లోపల దహించివేస్తూనే ఉంటుంది. అది విశ్వంకి తెలిసిన సంగతే. ఆ దుఃఖాన్ని గుర్తు చేయటం అతడికి ఇష్టం ఉండదు. మొదట్లో తనని చూసినప్పుడల్లా కొడుకులు గుర్తొచ్చి అత్తయ్య కన్నీళ్లు పెట్టుకునేది. ఇప్పుడిప్పుడు నిగ్రహించుకుంటున్నది. మామయ్య తన మున్సబు ఉద్యోగంలో నిండా మునిగిపోయాడు. తన దుఃఖాన్ని భగవంతుని మీద పడేశాడు. 'భగవంతుడే తీసుకుపోయినప్పుడు మానవ మాత్రులం మనం ఏం చేస్తాం' అని వైరాగ్యభావాన్ని మనసులో నింపుకున్నాడు. ఇప్పుడు కూతురు ముద్దు ముచ్చట్లే వాళ్లకు సర్వస్వం. ఆ తల్లిదండ్రులే కాదు... ఆ ఊరు

జనమంతా రేణుకని తమ అమ్మాయిగానే చూసుకుంటున్నారంటే... తల్లిదండ్రులకు అంతకన్నా ఏం కావాలి! బుద్ధిమంతురాలు.

'అవును మరి వాడన్నదీ నిజమే మరి.' అని మామయ్య లోపలికి వెళ్లిపోయాడు. మేనల్లుడు తెచ్చిన కొత్తబట్టలను తీసుకుని అత్తయ్య కూడా అక్కడ నుండి వెళ్లిపోయింది.

'ఇవిగో... ఇవి నీ కోసం' అని విశ్వం ఆపిల్‌పళ్లు బేగ్‌లోంచి బైటికి తీసి, ఒకటి ఆమె చేతిలో పెట్టాడు.

'ఉండనన్నావు కదా? ఈ పళ్లు ఎవరికోసం తెచ్చావు?' కొంటెగా అడిగింది రేణుక.

'అవి ప్రయాణంలో తినటానికి నా కోసం తెచ్చుకున్నాను.' అన్నాడు

తన మాటలు రేణుకను నమ్మించలేవని అతడికి తెలుసు. ఆమె నమ్మాలని చెప్పలేదు.

రేణుక చేపల కూరకోసం మసాల సిద్ధం చేస్తున్నది. మధ్య మధ్య బావతో ముచ్చట్లు సాగుతున్నాయి. రేణుకకు బావలో నచ్చిందల్లా జరిగింది మర్చిపోయి మేనమామలను చూట్టానికి వస్తున్నాడు.

చందమామ వెన్నెల పెరట్లో పడుతున్నది.

మామయ్య కోసం ఎవరో వచ్చినట్టున్నారు. మామయ్య వాళ్లతో బయట అరుగు మీద కూర్చున్నాడు. ఎప్పుడూ ఎవరో తమ తమ గొడవలు పట్టుకుని వస్తారు. వాళ్ల గొడవలు వినక తప్పదు.

విశ్వం స్నానం చేసి రావాలని బట్టలు మార్చుకుని చెరువువేపు వెళ్లాడు.

వంటపని ముగించి రేణుక వేణ్ణీళ్లు పెట్టుకుని స్నానం చేసింది. బావతో చాలా చెప్పుకోవాలని ఉంది. బావ ఇట్లా రావటం ఆమెకు సంతోషంగా ఉంది.

ఆ ఇంట్లో భోజనాలు త్వరగానే చేస్తారు. ఆ ఊళ్లో అలవాటే అది. ఊరు నిద్ర పోవటం కూడా త్వరగానేపోతారు. అప్పటికే భోజనాల వేళ అయింది. బావ చెరువు నుండి వచ్చిన వెంటనే అందరూ భోజనం చేసారు. పనివాళ్లు భోజనాలు చేసేసి వాళ్ల వాళ్ల ఇళ్లకి వెళ్లిపోయారు.

## 5

'... పెళ్లి చేసుకోబావా' అంది రేణుక.

'ముసలమ్మవు అయిపోయినట్టున్నావు రేణూ.'

'ఆ!?'

'లేకపోతే ఏమిటీ నీ సలహా?'

'ఎన్నాళ్లు ఒక్కడవు ఇట్లా బతుకుతావు చెప్పు? అమ్మా లేదు. చెల్లెళ్లు ఉన్నా వాళ్లు వాళ్ల కాపురాలు చేసుకుంటారు తప్ప నీ కొచ్చి సేవ చెయ్యరు కదా. నీకు నచ్చిన పిల్లనే చేసుకో. నీకు జ్వరమొస్తే, జబ్బుచేస్తే — సాయంచేసే మనిషి ఒకరు తోడు ఉండొద్దా చెప్పు బావా?'

అంత ప్రేమతో తన విషయమై ఎవరూ ఎప్పుడూ తనతో మాట్లాడలేదు. రేణుకని జాతకాలు కలవలేదని మేనరికం తప్పించి వేరే సంబంధం చూసి పెళ్లి చేసేసినప్పుడు చిన్నమ్మ మాత్రం ఓసారి తన పెళ్లి సంగతి ఎత్తింది. బుద్ధిమంతురాలు ఒక అమ్మాయి ఉందన్నది. పెళ్లి సంబంధం అని చెప్పకుండా మాట్లాడింది.

రేణుక కొత్త అందాలతో ముగ్ధ మోహనంగా ఉంది. ఆ అందం తల్లి కాబోతున్న అందం. ఈ సరికే తల్లి అయి ఉంటుందనుకున్న విశ్వంకి ఇప్పుడు ఆమె అందానికి అర్థం అదే అన్పించింది. అందుకే విశ్వం —

'బాబు పుట్టాడా పాపా?'

ఆమె విచిత్రంగా అతడ్ని చూసింది.

'ఎవరు నీ కిష్టం?' మళ్లీ విశ్వం ప్రశ్న.

'ఎవరూ వద్దు'

'వద్దనుకుంటే...'

అర్థం కాలేదు ఆమె మాటలు. ఆమెకు ఇష్టంలేకపోతే సంతానం ఆగిపోతుందా? పెళ్లయిన వెంటనే పిల్లలు కావాలని కదా? అయినా ఇప్పుడు పిల్లలు వద్దు. భర్త వద్దు... అనుకుంటే ఫలితమేమిటి? తెలివి తక్కువ తనం కాకపోతే.

ద్వారానికి దగ్గర్లో కుర్చీలో కూర్చున్నాడు విశ్వం. రేణుక గచ్చునేలమీద గోడకానుకుని కూర్చుంది. ఆమె ముఖంలో లేతగులాబీల అందాలు. తలకి స్నానం చేసిందేమో జుత్తు వీపుమీద వేలాడుతున్నది. లేత నీలంరంగు అంచుతో తెల్లనిచీర.

'నాకర్థం కావటం లేదు నీ మాటలు'

రేణుక నవ్వింది. దీపం వెల్తురు ఆమె ముఖం మీద అందాలఛాయలను తీర్చి దిద్దుతున్నది.

'సరేగాని బావ... చెప్పకుండా వెళ్లిపోవటం నీ కలవాటా?'

విశ్వం గుర్తు తెచ్చుకున్నాడు. జ్వరం నిమ్మళించిన తర్వాత రేణుకకు చెప్పకుండానే ఆ వేకువజామున ప్రయాణం పెట్టుకున్నాడు. అయితే ఆ రాత్రి ఆమె నిద్ర... మొద్దునిద్ర పోయింది. ఎంత ప్రయత్నించినా మేలుకోలేదు. ఆ సంగతి

అత్తయ్య చెప్పలేదా?

'వేకువ జామునే వెళ్లిపోతున్నట్టు చెప్పాలనుకుని —— నీ మొద్దు నిద్ర?' అని ఆ వివరాలు చెప్పాడు.

'ఇప్పటికీ అత్తవారింట్లో కూడా అట్లాగే నిద్ర పోతున్నావా?'

మళ్లీ నవ్వింది రేణుక. అతడి ప్రశ్నలన్నిటికీ జవాబులున్న నవ్వు అది.

ఈసారి విశ్వం కూడా పగలబడి నవ్వాడు.

'చాల పెద్దతప్పే. ఒప్పుకుంటున్నాను చెప్పకుండావెళ్లి పోయానుకదా. నీవే లేకపోతే ఆ జ్వరానికి నేను బతికేవాడినే కాదు. చనిపోయేవాడినే. అదే చాలసార్లు గుర్తొస్తుంది.' అన్నాడు.

విశ్వం తన ఆవేదననంతా కృతజ్ఞతా స్వరంతో వెల్లడించుకున్నాడు.

అంతలోనే రేణుక కండ్లు చెమర్చాయి.

ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

రేణుక కండ్లలోంచి రెండు కన్నీటి బిందువులు చెక్కిళ్ల మీదగా జారి చీర మీద పడ్డాయి.

ఆమెను ఓదార్చటానికి అతడు మాటలు మార్చాలనుకున్నాడు.

'నీకు బాబే పుట్టాడు'

'నీకెలా తెలుసు?'

'నాకు తెలుసు'

'కలగన్నావా?' జవాబు చెప్పలేని ప్రశ్న.

విశ్వంకి విసుగెత్తింది. అవుననో, కాదనో చెప్పక ఈ పెంకితనం మాటలు ఎందుకు? ఊగిసలాడాడు.

'మీ అన్నయ్యకు ఇష్టం లేదు' అంది రేణుక. అంత స్పష్టంగా చెప్పినప్పటికీ విశ్వంకి సంగతి బోధపడలేదు.

'అన్నయ్యకు ఇష్టం లేకపోతే?'

'ఎంత వెర్రివాడివి బావా నీవు?'

విశ్వంకి రేణుక మాటలు ఇప్పుడు బోధపడ్డాయి.

'మరి కాపరం చెయ్యటానికే తీసుకుపోయారు కదా'

'అవును'

'మరి కాపరం చెయ్యటమంటే ఏమిటి?' అడిగాడు విశ్వం.

'ఏమిటి?' ఆమె ఎదురు ప్రశ్న వేసింది.

'నీ మాటలు అర్థం కావటం లేదు'

అర్థం కాకపోతే అంతే నేనింక చెప్పను. నేను చెప్పినా నీకు అర్థం కాదు అన్నట్టుగా రేణుక ముఖం పెట్టింది.

'ఇంట్లో తెలుసునా?'

అక్కడ అత్తవారింట్లోనూ, ఇక్కడ కన్నవారింట్లోనూ అందరికీ తెలుసునని అర్థమయింది అతడికి.

కొన్నిసార్లు రేణుక సమాధానాలు ఆమె చూపుల్తోనే తెలుస్తున్నాయి.

'కారణం?'

'ఈసారి కలిసినప్పుడు మీ అన్నయ్యని నీవే అడుగు' అని పగలపడి నవ్వింది రేణుక.

అతడు నవ్వాడు.

'చెప్పు నీకు తెలుసు'

నాకేం తెలుస్తుంది అన్నట్టు కళ్లు తిప్పిందామె.

'నీ తోటి కోడళ్లు మరిదిని అడగలేదా?'

ఆమె కండ్లు నేలకు దించుకుని కూర్చుంది.

రేణుక బాధపడుతున్నదా? అట్లా అనిపించదు. ఆమె ప్రవర్తనలో హుందాతనంతో నిండుతనంతో వివాహజీవితం అల్పమైనది అన్నట్టుగా ఉంటుందామె ధోరణి. అయితే ఆమె సంతోషంగా కూడా కన్పించలేదు. మామూలుగా ఎంతో సంతోషంగా ఉత్సాహంగా ఎన్నెన్నో ముచ్చట్లు చెప్పే రేణుక ఇవాళ మౌనంగా కన్పించటంతో విశ్వంకి రకరకాల సందేహాలు కలిగాయి.

'సంతోషంగా ఉంటావని...' విశ్వం తన వాక్యాన్ని ముగించలేక పోయాడు.

'ఏం సంతోషం లే బావా...'

దాంతో విశ్వంకి ముడి విడిపోయినట్టయింది.

జీవితం చిత్రంగా ఉంటుంది. అర్థం కాదు. ఎక్కడో సంతోషం. ఎక్కడో దుఃఖం. మనకు వాటితో సంబంధమే ఉన్నట్టు అన్పించదు. అవే మనల్ని ఆవరిస్తాయి. మనం నిస్సహాయులం అవుతాం. మన చేతిలో ఏ పరిష్కార సాధనమూ ఉండదు. మాటలు రావు. చెప్పుకోలేము. మనసు మొద్దు బారిపోతుంది. దాంతో విశ్వం మౌనంగా ఉండిపోయాడు.

రేణుక సందర్భం గ్రహించింది.

ఆమె ఎన్నిరాత్రులు ఆలోచనలతో, విధినినిందిస్తూ, పెళ్లిపెద్దలను తిట్టుకుంటూ,

తన నిస్సహాయ స్థితిని తలచుకుని బాధపడిందో——

ఆమె మాటలు విశ్వాన్ని కలవరపరచాయి.

మాట మార్చాలనుకున్నదో ఏమో 'బాగా నిద్రొస్తున్నది బావా.' అని అక్కడ నుండి లేవబోయింది.

హరికెన్ లాంతరు గుప్పమని మండి ఆరిపోయింది. ఆ లాంతరుకు అదో జబ్బు.

'ఉండుబావా దీపం వెలిగించి వస్తాను' అని ఆమె ఇంట్లోని ఆముదపు దీపం వెలిగించింది.

ఆ చీకటిని దీపకాంతులు కౌగలించుకున్నాయి. ఆ చిన్నవెలుగులో ఆమె పెదవులు అందంగా మెరిసాయి. అక్కడ వలయాలుగా తిరుగుతున్న మాధుర్య పరిమళాలను వెలుగు కావలించుకుని ముద్దాడింది.

బైట వీధిలో ఎవరో కొత్త మనిషి గొంతు విన్పించింది. వెళ్లి చూసింది. తలపాగాతో, చేతిలో పొడవాటి కర్రతో వచ్చాడు. ఆ వచ్చిన మనిషి ఎవరో. తెలిసిన మనిషి అన్పించలేదు. మామయ్య కోసం ఇట్లా వస్తూనే ఉంటారు.

'బాబేదమ్మా?'

'ఎవరు?' అని అడిగింది రేణుక.

చెప్పాడు. ఆమె అత్తవారి ఊరునించి ఆ మనిషి వచ్చినట్టు తెలిసింది.

'బాబేదమ్మా' అని మళ్లీ అడిగాడు ఆ వచ్చిన మనిషి.

'నాన్న పడుకున్నాడు. లేపుతాను.' అని ఆ మనిషి ఎందుకు వచ్చాడో అడగాలని కూడా అన్పించలేదు ఆమెకి.

నిద్ర లేచి వచ్చాడు మామయ్య.

రేణుక భర్త నరసింహానికి ప్రమాదంగా ఉందంట. ఊళ్లో దెబ్బలాటలో కొట్టుకుంటుంటే వాళ్లను విడిపించటానికి వెళ్తే తలమీద ప్రమాదకరమైన గాయాలు తగిలాయట. ఆస్పత్రికి తీసుకుని వెళ్లారట. ఆ సంగతి విని నిద్ర పోతున్న అత్తయ్యతో ఆ సంగతి చెప్పి ఆ వచ్చిన మనిషితో వెళ్లాడు మామయ్య.

## 6

నరసింహంని విశ్వం తొలిసారి చూడటం ఆస్పత్రి మంచం మీదనే. పలాసాలోని డాక్టరు పెద్దాసుపత్రికి వెంటనే తీసుకువెళ్తేనే తప్ప ఇక్కడేమీ చెయ్యలేము. పెద్దాసుపత్రి అంటే విశాఖపట్నంలోని కింగ్ జార్జి ఆసుపత్రి. అక్కడకు వెళ్లేవరకు ప్రాణం నిలబడితే మీరు అదృష్టవంతులే అని సలహా ఇచ్చి స్వయంగా ఆ

డాక్టరే తనకు తెలిసిన ఓ పెద్దమనిషి కారు మాట్లాడి ఆ అర్ధరాత్రి విశాఖపట్నం తెచ్చాడు. పేషెంట్‌తో స్వయంగా డాక్టర్ ఉండటంతో వెంటనే ఎమర్జెన్సీవార్డ్‌లో అడ్మిట్ చేసుకున్నారు. డ్యూటీ డాక్టరు స్నేహితుడే. వెంటనే చికిత్స మొదలు పెట్టారు.

ఇప్పుడు నరసింహం ఆరోగ్యం ఇంకా ప్రమాదస్థితిలోనే ఉంది అంటున్నారు. నరసింహం తల్లీ తండ్రీ, అత్తయ్య, మామయ్యా అంతా వచ్చారు. అంతా ఆందోళన పడుతున్నారు. ఆస్పత్రిలో వాళ్లంతా ఉండటానికి కూడా ఇబ్బందే. వాళ్లతో పాటు రేణుక కూడా వచ్చింది. డాక్టర్లు ధైర్యం చెప్తున్నారు. అయినా ఎవరికీ నమ్మకం కలగటం లేదు. రెండో రోజు నరసింహం వాళ్ల ఊరునుండి బంధువులు ఓ డజనుమంది వరకు వచ్చారు. తల్లితండ్రులను, భార్యను తప్ప వేరేవాళ్లను లోపలకు రానివ్వటం లేదు ఆస్పత్రి సిబ్బంది. విజిటింగ్ అవర్స్‌లో సైతం వేరే వాళ్లను కనీసం చూడటానికి కూడా సమ్మతించటం లేదు. దాంతో పరిస్థితి ప్రమాదకరమే అని ప్రచారమయింది. రేణుక బాధతో ఉంది. ఆమె ముఖంలోని దైన్యాన్ని చూస్తుంటే నరసింహం కోలుకోవటానికి తనకు చేతనయిన దంతా చెయ్యాలనుకున్నాడు విశ్వం.

వాళ్లంతా ఇప్పుడు విశ్వం ఇంట్లోనే ఉంటున్నారు. ఆ ఇంట్లో నీళ్ల ఇబ్బందికి తోడు అదనంగా అయిదుగురు ఉండటానికి సదుపాయంగా లేదు. విశ్వం వాళ్లకి తనతో పాటే హోటల్ భోజనమే ఏర్పాటు చేశాడు. కొన్నిసార్లు కేరేజి తెప్పించి —— కొన్నిసార్లు హోటల్లోనే భోజనం చేసి వచ్చేట్టు ——

రోగి కోలుకుంటున్నాడని డాక్టర్లు చెపుతున్నప్పటికీ వచ్చిపోయే చుట్టాలూ, బంధువులూ రకరకాలుగా చెప్పుకుంటున్నారు. ఆ మాటలు రేణుకను గాయపరుస్తున్నాయి. గ్రహశాంతి, జాతకాలు మాటలు మధ్యమధ్య వస్తున్నాయి. నరసింహం జాతకంలో దోషాలు ఏమీ లేవని తల్లీ తండ్రీ చెపుతున్నారు. అత్తామామలు ఆ మాటలు చెప్పుకుంటున్నప్పుడు రేణుక వింది. ఓ సాయంత్రం ఆస్పత్రి నుండి వచ్చిన తర్వాత ఏడవటం మొదలు పెట్టింది రేణుక.

విశ్వం ఓదార్చ ప్రయత్నించాడు. అయినా ఆమె దుఃఖం ఆగలేదు. నరసింహం ఆస్పత్రిలో కనీసం నెలదినాలకు పైనే ఉండాల్సి ఉంటుందని అర్థమయింది. విశ్వం అద్దె ఇంట్లో ఇబ్బంది చూసి —— రేణుకకు నచ్చ జెప్పి రేణుకను తీసుకుని అత్తయ్య, మామయ్యలు ఊరు వెళ్లిపోయారు. తర్వాత నర్సింహం తల్లి కూడా వెళ్లిపోయింది.

ఇప్పుడు విశ్వం, నర్సింహం తండ్రీ ఇద్దరే. ఆఫీస్‌నుండి వచ్చేటప్పుడు విశ్వం ముందు ఆస్పత్రికి వెళ్లి అక్కడ విజిటర్స్ అవర్స్ సమయమంతా నరసింహంతో గడిపి వస్తున్నాడు. కొన్నిసార్లు విశ్వమే వచ్చి రాత్రిపూట నర్సింహం దగ్గర

పడుకుంటున్నాడు.

రేణుకనీ, మామయ్యనీ, అత్తయ్యనీ రైలెక్కించినప్పుడు విశ్వంకి దుఃఖం ముంచుకొచ్చింది. దెబ్బ తగిలి నేలమీద పడిపోయిన పక్షిలా గిలగిల కొట్టుకుంటున్నట్టు రేణుక కన్పించింది. ఆ దృశ్యం పదేపదే కళ్ల ముందు కదలాడుతున్నది. మన పెద్దలు అంతా మన మంచికే అని అన్నారు కదా. ప్రాణాపాయం రాలేదు. ఇప్పుడు ఇంక కోలుకున్నట్టే. ఏదో దోషం ఈ రకంగా పోయినట్టే అని రేణుకని ఎంతో ఓదార్చాడు. ఆమె కన్నీళ్లని తన చేత్తో తుడిచి 'ధైర్యంగా ఉండాలి' అని నచ్చజెప్పాడు. 'నేను ఉన్నాను కదా. అవసరమైతే మా ఆఫీసర్‌ని బతిమాలి సెలవన్నా పెట్తాను.' అని ధైర్యం చెప్పాడు. కాని విశ్వంకి సెలవు పెట్టాల్సినంత అవసరం ఏర్పడలేదు.

'అన్నయ్య డిశ్చార్జ్ అయినప్పుడు మాత్రం నువ్వు ఇక్కడకు రావాలి. సింహాచలం స్వామిని మొక్కుకున్నాను.' అని గుర్తు చేశాడు విశ్వం. రేణుక సరే అంది.

ఆస్పత్రిలో చేరిన వారం రోజులు తర్వాత నర్సింహంకి స్పృహ వచ్చింది.

నరసింహం తండ్రిని గుర్తు పట్టాడు. ఆస్పత్రిలో ఉన్నట్టు గ్రహించాడు. డాక్టర్లనీ, నర్సులనీ, మందుసీసాలనీ చూశాడు. పొడవుగా, కళకళలాడుతూ కన్పడిన ఈ కొత్తమనిషి ఎవరా అని చూస్తున్నప్పుడు తండ్రి పురుషోత్తం, 'రేణుక బావరా. విశ్వం.' అని పరిచయం చేశాడు.

అతడికి స్పృహ వచ్చిన కొద్ది నిమిషాలకే అతడి బెడ్‌కి మూడో బెడ్ దగ్గర ఘొల్లున ఏడుపు విన్పించింది. ఒకేసారి నలుగురయిదుగురు ఏడుస్తు న్నట్టున్నారు. తర్వాత తెలిసింది. ఆ పేషెంట్ భార్య, తల్లీ, అక్క చెల్లెళ్లూ ఏడుస్తున్నారని. పేషెంట్‌ని రెండు రోజుల క్రితమే తెచ్చారు. కొద్ది సేపట్లోనే ఆ మృతదేహం అక్కడ నుండి వెళ్లిపోయింది.

'కూర్చో తమ్ముడూ' అన్నాడు నరసింహం.

'చివరకు ఇక్కడ నిన్ను చూశాను. రేణుక —' అని ఆగిపోయాడు.

'తమ్ముడూ' అన్న అతడి ప్రేమకి విశ్వం పులకించిపోయాడు.

'రేణుక నీ ముచ్చట్లు చెప్తునే ఉంటుంది. నీకు దేవుడంటే భక్తి ఎక్కువ అని. పుస్తకాలు రోజూ చదువుతావని. నీకు మంచి ఉద్యోగం వచ్చిందని. నీ చిన్నమ్మే నిన్ను చదివించిందని. మీ అమ్మ చనిపోయిన తర్వాత మీ చిన్నమ్మే నిన్ను పెంచిందని. డిగ్రీలో నీకు ఫస్టక్లాస్ వచ్చిందని మన రైతు కుటుంబాల్లో చదువులు సంగతి నీకు తెలుసుకదా తమ్ముడూ — నీకు తెలుసుకదా మాది పెద్ద సమిష్టికుటుంబం. నా

చదువు హైస్కూల్‌తోనే ఆగిపోయింది. టీచర్ ట్రయినింగ్. ఊరుకు దగ్గర్లోనే ఉద్యోగం. అయిదు మైళ్లు. రోజూ కాలినడకనే వెళ్లాలి. సైకిల్ ఏదన్నా తీసుకుందామంటే రోడ్లు లేవు. జీతం ఇంట్లో ఇచ్చేయాలి... నా ఖర్చులకు కొంచెం ఉంచుకుంటానంతే... నాకు చదువు అంటే ఇష్టం. కాని నా కోరిక తీరలేదు. ఇప్పుడు ప్రయివేట్‌గా ఇంటర్మీడియట్ రాయవచ్చునని చెప్తున్నారు. రాస్తాను. తర్వాత డిగ్రీ కూడా ప్రయివేట్‌గానే రాస్తాను... ఈ పట్టుదలతో ఉండగా ఈ ప్రమాదం...' అని కన్నీళ్లు పెట్టుకున్నాడు నరసింహం.

ఆ కన్నీళ్లు చూసినప్పుడు విశ్వం గుండె బరువెక్కిపోయింది. గొంతు రుద్ధమయింది.

విశ్వం చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని గట్టిగా పట్టుకుని చాలాసేపు విడవలేదు. విడిపించుకోవాలనిపించలేదు విశ్వంకి. నిశ్శబ్దంగా కూర్చున్నాడు. నోట ఏ మాటా పలకలేదు.

'నాకే కాదు అమ్మా నాన్నలకి కూడా నీవే సేవ చేయవలసి వచ్చింది. ఈ పట్నంలో ఎవరు దిక్కు మాకు. నీవే లేకపోతే...'

విశ్వం కళ్లలోంచి జలజలా కన్నీళ్లు కురిశాయి.

ఆస్పత్రిలో ఆ సాయంత్రం విజిటర్స్ టైమ్ అయిపోయింది. గంట మోగింది. వార్డులో ఇంకా పేషెంట్స్‌వద్ద కూర్చుని కదలకుండా ఉన్నవాళ్లని టైమ్ అయిపోయిందని హెచ్చరిస్తున్నారు సిస్టర్స్.

విశ్వం నెమ్మదిగా నరసింహం చెయ్యిని వదిలించుకుని కర్చీఫ్ జేబులోంచి తీసుకుని కన్నీళ్లు తుడుచుకున్నాడు.

ఇదివరకు నరసింహం నాన్నగారు పురుషోత్తం రాత్రిపూట పేషెంట్ దగ్గర ఉండేవారు. ఇప్పుడు డాక్టర్లు ఎవరూ ఉండక్కర్లేదు అనటంతో ఆయన కూడా విశ్వంతో పాటే ఇంటికి వెళ్లటానికి సిద్ధపడ్డారు.

ఆ సిస్టర్స్‌లో ఒక నైట్ డ్యూటీ సిస్టర్ బాగా పరిచయమైంది విశ్వంకి. ఆమె శ్రద్ధ తీసుకుంటూ ఉంది. ఆ సిస్టర్ ఇంకా రాలేదు. సిస్టర్స్ అంతా కలుపుగోలుగా ఉండేవాళ్లు. నిజంగా వాళ్లు అశ్వినీ దేవతలే అన్పించేవాళ్లు. వాళ్ల ముఖంలో చిరునవ్వు. ఆ ప్రేమ. సేవాభావం. వాళ్లు చెప్పే ధైర్య వచనాలు. వాళ్లు చూపే శ్రద్ధ.

ఆస్పత్రిలో ఆ సిస్టర్స్ కూడా ఒక ఆకర్షణ అయ్యారు విశ్వంకి.

## 7

తెచ్చుకున్న పైకం ఖర్చయిపోవటంతో ఊరువెళ్లి రావాలనుకున్నాడు నరసింహం

తండ్రి పురుషోత్తం. నిజానికి ఆయన ఆస్పత్రిలో ఉండాల్సిన పనికూడా లేదు. విశ్వం కావలసిన పనులన్నీ శ్రద్ధగా చూసుకుంటున్నాడు. నర్సులు కూడా మంచివాళ్లే కావటంతో నరసింహంకి నిశ్చింతగా ఉంది. విశ్వంకి సెలవు పెట్టేట్టు లేదు. సెలవుదినాల్లో తప్ప మిగిలిన రోజుల్లో ఆఫీస్ నుండి నేరుగా ఆస్పత్రికే వస్తున్నాడు. ఇప్పుడు ప్రమాదం తప్పిపోయి నరసింహం కోలుకుంటున్నందున సంతోషంగానే ఉన్నాడు.

పురుషోత్తం ఊరు వెళ్లిన రోజుసాయంత్రమే రేణుక, మామయ్య వచ్చారు. ఈ సారి రేణుక ముఖం కళకళలాడుతున్నది. ఊరునుండి పిండివంటలు తెచ్చింది. భర్తకోసం. రోజూ వాటిని భర్తకి ఇచ్చేట్టుగా విశ్వంకి ఆ పని అప్పజెప్పింది. కిందటిసారి మామయ్య విశ్వం దగ్గర కొంత అప్పు తీసుకున్నాడు. ఆ పైకం విశ్వంకి తిరిగి ఇచ్చేయటం కూడా ఒక పని ఈసారి.

ముందు అనుకున్న దానికన్నా త్వరగానే నరసింహంని డిశ్చార్జ్ చేసే అవకాశం ఉందని స్టాఫ్‌నర్స్ ఓసారి మాటల్లో అంది. దాంతో అందరికీ ఊపిరి పీల్చుకున్నట్టు అయింది. రెండోదినం డాక్టర్లు నిర్ధారణ చేశారు. ఇంట్లో మందులు వాడుకుంటే సరిపోతుందని, తలమీద కుట్లు విప్పేసిన తర్వాత అవి త్వరగానే మానిపోయాయి. పేషెంట్ బలహీనత త్వరలోనే తగ్గిపోతుందన్నారు. ఇప్పుడు నరసింహం మధ్యమధ్య వార్డ్‌లో తిరుగుతున్నాడు. బైటికిపోయి చెట్లమధ్య తిరిగి వస్తున్నాడు. తోటిపేషెంట్ల దగ్గరకు పోయి కూర్చుని ముచ్చట్లు చెప్తున్నాడు.

అందుచేత అంతా కలిసే వెళ్లిపోవచ్చని మామయ్య, రేణుక తమ తిరుగు ప్రయాణాన్ని నరసింహం ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయ్యేవరకు ఆపుకున్నారు. డాక్టర్ల సహకారంతో ముఖ్యంగా స్టాఫ్‌నర్స్ సహాయంతో ఓ ఆదివారం సాయంత్రం నరసింహంని డిశ్చార్జ్ చేశారు. విశ్వం రెండోరోజు సింహాచలంలో స్వామిని దర్శనం చేసుకుని వెళ్లవచ్చునని ఇది వరకే వాళ్లతో చెప్పినప్పటికీ వాళ్లకా దృష్టి లేకపోయింది. తనకా అవకాశమే ఇవ్వలేదు. రెండోరోజు ఉదయమే వాళ్లు ముగ్గురూ రైల్లో వెళ్లిపోయారు. స్టేషన్‌కి వెళ్లి వాళ్లని సాగనంపినప్పుడు రేణుక కళ్లల్లోంచి కన్నీటి బిందువులు రాలాయి. అట్లా కన్నీళ్లు పెట్టుకోకూడదు రేణూ. నువ్వు చాల అదృష్టవంతురాలివి అని తన చేత్తో ఆమె కన్నీళ్లని తుడిచి ఓదార్చాడు.

స్టేషన్ నుండి తిరిగి ఇంటికి వచ్చి స్నానాదులు ముగించి బట్టలు వేసుకుంటుంటే తన సూట్‌కేస్ మీద రేణుక చీరె, జాకెట్టు కన్పించాయి. ఆమె వేకువ జామున ప్రయాణంతొందర్లో మరచిపోయిందనుకున్నప్పటికీ, ఆమె శరీర

పరిమళాలతో అవి అతడిని ముంచెత్తాయి.

8

అప్పుడే సూర్యాస్తమయమయింది. ఆ చల్లనివెలుగుల్లో తల్లి నాగావళి ప్రవహిస్తున్నది. గంభీరమైన గమనం. వరద నాగావళి కాదు. ఇది తల్లి నాగావళి. మాతృదేవతలాగ తనని పలకరిస్తుంది. అక్కడే అమ్మ అంత్యక్రియలు జరిగాయి. ఆ ఒడ్డునే. ఆ సరుగుడు తోటల ఒడ్డునే. అక్కడే నిమజ్జనం. అందుకే విశ్వంకి అది తీర్థయాత్ర. అమ్మ గుర్తొచ్చినప్పుడల్లా విశ్వం శ్రీకాకుళం వస్తాడు. ఆ నది ఒడ్డున కొన్ని సార్లు గంటల తరబడి ఒక్కడే కూర్చుంటాడు. చాలాసేపు నదిలో స్నానం చేస్తాడు. సూర్య నమస్కారాలు చేస్తాడు. గుండె బరువు చల్లారిన తర్వాత తిరిగి విశాఖ వెళ్లిపోతాడు. ఇవాళ అతడి పుట్టిన రోజు. ఈసారి చాలా సేపయినా అక్కడి నుండి వెళ్లిపోవాలనిపించ లేదు. పండువెన్నెల కనీసం చివరి బస్సులోనయినా విశాఖ ఈ రాత్రికి చేరుకోవాలి. ఇనేళ శ్రీకూర్మం యాత్ర. వెళ్లాలన్న ఆలోచన ముందు లేదు. నాగావళిలో, ఆ ఒడ్డున ఇసికలో, గుండెనిండా అమ్మని నింపుకుని కూర్చోవటమే ఎంతో ఆనందం. తల్లిలేని లోటు దుఃఖం భారమంతా ఆ నదీ జలాల్లో స్నానం చేశాకా మాయమైనట్టు అన్పిస్తుంది. మనసంతా మాతృదేవత చుంబనలతో పులకించినట్టు ఉంటుంది. ఆ ఆనందం ముందు ఇంకేది వద్దు అన్పిస్తుంది.

శ్రీకూర్మంకి కూడ తన జీవితంలో ప్రాధాన్యం ఉంది. శ్రీకూర్మనాధుని వర ప్రసాదమే తన బిడ్డ అనేదట అమ్మ. తాతయ్య చెప్పాడు. పది పన్నెండేళ్ల వయసులో తాతయ్యతో, ఇతర బంధువులతో వెళ్లటమే తొలిసారి. అప్పుడు ఆ రాత్రి ఆ చీకట్లో వేలాది యాత్రికులతో ఆ క్షేత్రం కిటకిట లాడటం గుర్తొచ్చింది. ఒకసారి వెళ్లినప్పుడు తమ బంధువు పన్నెండేళ్ల అమ్మాయి అక్కడ ఆ రాత్రి తప్పిపోయింది. రెండో రోజు ఉదయం సముద్రస్నానం చేసి వచ్చిన తర్వాత మందిరం దగ్గర దొరికింది.

ఇవేళ నదిలో స్నానం చేసి, ప్రార్థన చేసి బట్టలు మార్చుకున్న తర్వాత, శ్రీకూర్మం వెళ్తే బావుండు ననిపించింది విశ్వంకి. రేపు ఎట్లాగూ సెలవు దినం. ఆదివారం కలిసివచ్చింది. కొన్నిసార్లు అక్కడ తన మిత్రులు, బంధువులు కలిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆ దేవుని వరప్రసాదమే తన బిడ్డ అని అమ్మ అనేదట. అమ్మ తృప్తికోసం... ఆ లోకాన ఉన్న అమ్మకు సంతోషం కలిగిస్తుంది. దాంతో విశ్వం అక్కడ నుండి బస్‌స్టాండ్‌కి వెళ్లాడు.

ఆ బస్టాండ్ నిండా శ్రీకూర్మం యాత్రికులే. ఆ టిక్కెట్ ఖరీదు రెట్టింపు. అయినా జనం టిక్కెట్ల కోసం పోట్లాడుకుంటున్నారు. ఓ పెద్దమనిషి దగ్గర రెట్టింపు పైకం

ఇచ్చి విశ్వం టిక్కెట్టు సంపాదించుకున్నాడు.

ఆ క్షేత్రం వేలాది భక్తులతో కిటకిటలాడుతున్నది. జాతర. దుకాణాలు. హోటళ్లు. మిఠాయి దుకాణాలు. రకరకాల వినోదాలు. ఆటలు పాటలు. వింతలు. ఉత్సాహ కోలాహలం. విద్దూరాలు తిలకిస్తూ పులకించిపోతున్నారు. దైవదర్శనం చేసుకుని బైటపడాడు విశ్వం తెల్లవారే వరకు ఉండి సముద్ర స్నానం చేయటం పుణ్యం అంటారు. ఈ చలిలో రాత్రి ఉండటానికి సిద్ధపడి రాలేదు. మందిరానికి దూరంగా కొందరు ఎడ్లబళ్లల్లో వచ్చిన భక్తులు బండ్లకింద నిద్రపోతున్నారు. కొందరు చెట్ల కింద నిద్రపోతున్నారు. బళ్లల్లో వచ్చిన చాలామంది చలికి దుప్పట్లు, బొంతలు తమతో తెచ్చుకున్నారు. ఆడవాళ్లు సైతం జాతరలో తిరిగితిరిగి కాళ్లునొప్పులు పుట్టి అలసిపోయి కూర్చునే కునికిపాట్లు పడుతున్నారు.

దాదాపు మైలు దూరంలో సముద్రం. సరుగుడుతోటలు మధ్య మధ్య. ఆ ఇరుగుపొరుగు గ్రామాల్లో తమ బంధువులు ఉన్నారు. అయినా ఇప్పుడు వెళ్లే పరిస్థితి కాదు. దుకాణాల్లో రెండు ముతక నూలు దుప్పట్లు కొనుక్కున్నాడు.

ఆ దగ్గర్లో ఉన్న ఓ తోటలో ఎటు చూసినా ఎడ్ల బండ్లే. అక్కడే చెట్ల క్రింద, బండ్ల క్రింద, ఆడా మగా నిద్ర పోతున్నారు. విశ్వం మరికొంత లోపలికి పోయాడు. ఓ చెట్టుక్రింద జనం తక్కువగా ఉన్నారు. వాళ్లకు దగ్గర్లో స్థలం వెతుక్కుంటూ ఉంటే ఓ బండివాడు సహాయపడ్డాడు. వాడి దగ్గర టార్చ్‌లైట్ ఉంది. క్రింద నేలమీద పశువులకోసం తెచ్చిన వరిగడ్డి పలచగా పరిచి దాని మీద దుప్పటి వేసి పక్కచేసి పెట్టాడు. యాత్రికులు జాగరాలు చేస్తున్న వాళ్లు చేస్తూనే ఉన్నారు.

తెల్లవారింది. జనం ఆ చుట్టు ప్రక్కల రాత్రి వందలాది బండ్ల దగ్గర కన్పించిన వాళ్లు ఇప్పుడు బండ్లుతోలే వాళ్లు తప్ప ఎవరూ లేరు. అంతా ఆ చలిలో సముద్రం దారి పట్టారు. చాలమంది సముద్రస్నానాలు చేసి తడి బట్టలతో తిరిగి వస్తున్నారు.

సముద్రస్నానం పర్వదినాలలో అలవాటే. ఇప్పుడు ఇక్కడ విశ్వంకి మరింత సంతోషంగా ఉంది. తిరిగి వచ్చి దైవ దర్శనం, పూజలు చేసుకునేసరికి ఉదయం ఎనిమిదయింది. దేవాలయం బైటకు వచ్చేసరికి దూరంగా రేణుకలా ఒక యువతి కన్పించి గబగబా అటు నడిచాడు విశ్వం. ఆ ఉదయకాంతిలో అక్కడ వాతావరణం ఉత్సవవేడుకలతో నిండిపోయింది. రేణుక పండ్లదుకాణంలో అరటిపండ్లు కొనుక్కుంటున్నది. ఆమె చుట్టూ ఆమె ఈడు వాళ్లే మరో నలుగురు.

'రేణూ' అని పిలిచేసరికి వెనక్కి తిరిగిచూసి ఆశ్చర్యపోయింది 'బావా' అని మురిసిపోయింది.

'బావా, రాత్రి ఆ వేపచెట్టు కిందేనా నీవు పడుకున్నావు?'

'అక్కడ' అని దూరంగా మామిడితోట చూపించింది.

అవునేమో. తనకి గుర్తులేదు. తెల్లవారి లేచినప్పుడు చూశాడు. వేపచెట్టే. 'రాత్రి నీవు అక్కడే పడుకున్నావు కదా' ఆశ్చర్యపోతున్నది.

మన బండి అక్కడే ఉంది. అక్కడే మేము పడుకున్నాము. ఆ వెన్నెల్లో చూసి, ఎందుకో అన్పించింది. నువ్వు వస్తావో ఏమో అని. నీలాంటి వాళ్లు నలుగురైదుగురు —— దగ్గరగా చూస్తే నీవు కాదు... అట్లా... నీవు రావడం సంతోషంగా ఉంది బావా. మీ అన్నయ్య రాలేదు. ఇంట్లో మా అత్తమ్మకి వొంట్లో బాగాలేదు. ముందు మొక్కుకున్నాను. అందుచేత కాంతమ్మ, సుజాత, రాధమ్మ, దమయంతి... మేమంతా వచ్చాము. నువ్వు మా దగ్గరే పడుకున్నావు బావా రాత్రి —— అని విస్తుపోయింది రేణుక.

బండివాడు రాత్రి తనని గుర్తు పట్టినట్టు అన్పించింది విశ్వంకి. అవును బండివాడి చేతిలో టార్చ్‌లైట్ ఉంది. అదొక ఆధారం. సరే అంతా చిత్రంగానే ఉంది.

వాళ్ల ముఖాలు గుర్తు పట్టగలడు — వాళ్లు ఆమె స్నేహితురాళ్లని తెలుసు. కాని వారి పేర్లు తెలీవు. వాళ్లు తనని గర్తు పట్టగలరు. తమతో గూడుబండిలో ఊరు రమ్మని రేణుక ఒత్తిడి. వాళ్లతో వెళ్లాలనిపించింది. పొలాల్లోంచి రెండెడ్లబండ్లో, గంటల గణగణ మోగుతుంటే ప్రయాణం చేయటం అతడికి ఇష్టం. ఇట్లాంటి అరుదైన భాగ్యాలు భవిష్యత్తులో మళ్లీ దొరుకుతాయా?

## 9

ఆ రాత్రి భోజనాలు అయిన తర్వాత అత్తయ్య, మామయ్యలు పెళ్లి సంబంధాలు గురించి చాలాసేపు మాట్లాడారు. ఆ పెళ్లి సంబంధాలు, బంధుత్వాలు వాళ్ల వాళ్ల ఆస్తులూ, వాళ్ల కట్నాలూ కానుకలూ, మర్యాదలూ మన్ననలూ చెప్పుకుంటున్నారు. అవన్నీ విశ్వంని పెళ్లికి ఒప్పించాలనే ఉద్దేశంతోనే —— అది విశ్వం అర్థం చేసుకున్నాడు. అయితే తను వాళ్ల మాటలకు చిక్క కూడదన్న ఆలోచనతో ఎక్కడా జోక్యం చేసుకోలేదు. అత్తయ్య, మామయ్య ఇద్దరూ విశ్వంని పెళ్లికి ఒప్పించాము అన్న అభిప్రాయానికి వచ్చినట్టు కూడా అన్పించింది విశ్వంకి.

తను వాళ్లకి మళ్లీ దొరుకుతాడా? ఈ ఊరు మళ్లీ ఇప్పట్లో వస్తాడా? రేణుకని చూట్టానికి వెళ్లాలంటే వాళ్ల అత్తవారి ఊరే వెళ్లొచ్చు.

అత్తయ్య, మామయ్య కూడా —— రాత్రి పదకుండు గంటల గోడగడియారం మోత విని —— నిద్ర పోవటానికి వెళ్లిపోయారు.

రేణుక ఏడుపు వినిపించింది విశ్వంకి.

'ఎందుకు ఎందుకు రేణూ' అని ఎంత ప్రశ్నించినా, దుఃఖాన్ని ఆపుకోలేక రేణుక గొంతు విప్పలేకపోయింది.

విశ్వం మంచం మీద కూర్చున్న వాడల్లా రేణుకని ఓదార్చాలని ఆ కండ్లనించి కురుస్తున్న కన్నీళ్లని తన చేతుల్తో తుడుస్తున్నప్పుడు ఆ రెండు చేతుల్ని గట్టిగా పట్టుకుంది రేణుక.

'బావా నీవు పెళ్లి చేసుకోవు... నీ పట్టుదల నీది... నాకు పిల్లలు కలగరు. నన్ను గొడ్రాలు అంటారు. నా కర్మ ఇది. ఇంతే బావా...' అని కొంచెం సేపు తన కళ్లమీద ఉన్న ఆ చేతుల్ని కోమలంగా పట్టుకుని —— నెమ్మదిగా విడిచి పెట్టి లేచి తల్లి దగ్గరకు పడుకోవటానికి వెళ్లిపోయింది రేణుక.

* * *

'ఆంధ్రప్రభ' వార పత్రిక

*8.3.61, 15.3.61*